మారుతి కొత్త కార్లు వచ్చేస్తున్నాయి..

2025లో నాలుగు కార్లను విడుదల చేయనున్న సంస్థ

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ టాప్ గేర్‌లో దూసుకుపోతున్నది. ఇప్పటికే కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్న సంస్థ..కొత్త ఏడాదిలో నయా మాడళ్లను విడుదల చేయబోతున్నది. ఢిల్లీ వేదికగా జరగనున్న వాహన పండుగలో ఈ కొత్త మాడళ్లను ప్రదర్శిస్తున్నది. వీటిలో తొలి ఎలక్ట్రిక్ వాహనంతోపాటు మూడు ఎస్‌యూవీ మాడళ్లు ఉన్నాయి. వీటి వివరాలు..

మారుతి ఈ-విటారా:

దేశీయంగా ఈవీ కార్లకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని మారుతి కూడా ఈ మాడళ్లను విడుదల చేయడానికి సిద్ధమైంది. వచ్చే నెలలో 17 నుంచి 22 వరకు ఢిల్లీలో జరుగుతున్న భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025లో తన తొలి ఈ-విటారాను ప్రదర్శించబోతున్నట్లు తెలుస్తున్నది. 49 కిలోవాట్లు, 61 కిలోవాట్లా బ్యాటరీ సామర్థ్యంతో రూపొందించిన ఈ కారు ధర రూ.22 లక్షల స్థాయిలో ఉంటుందని అంచనా. సింగిల్ చార్జింగ్‌తో 550 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.25 ఇంచుల టచ్‌స్క్రీన్ ఇన్ఫోసిస్టమ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్, 360-డిగ్రీల కెమెరా వంటి ఫీచర్స్ ఉన్నాయి.

నయా గ్రాండ్ విటారా

కాంప్యాక్ట్ ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేయడానికి నయా గ్రాండ్ విటారాను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. వచ్చే ఏడాది జూన్‌లో ప్రవేశపెట్టనున్న ఈ కారును సరికొత్తగా తీర్చిదిద్దినట్లు, ముఖ్యంగా ఇంటీరియర్ డిజైనింగ్, డ్యాష్‌బోర్డ్, ఐదు-ఏడుగురు కూర్చోవడానికి విధంగా డిజైన్ చేసింది.

కొత్త బాలెనో

ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోను మరింత ఆధునీకరించి విడుదల చేయడానికి సిద్ధమైంది మారుతి. మార్చి నెలలో అందుబాటులోకి రానున్న ఈ కారులో అతిపెద్ద టచ్‌స్క్రీన్, ఫుల్ డిజిటల్ డ్రైవర్ డిస్‌ప్లే, సింగిల్-పాన్ సన్‌రూఫ్, వైర్‌లెస్ ఫోన్ చార్జర్, టైర్-ప్రెషర్ మానటరింగ్ సిస్టమ్, ఆరు ఎయిర్ బ్యాగ్‌లతో తీర్చిదిద్దింది.

అప్‌గ్రేడ్ బ్రెజ్జా

మూడేండ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చిన బ్రెజ్జాను మళ్లీ ఆధునీకరించి మార్కెట్లో విడుదల చేయబోతున్నది సంస్థ. స్కోడా కైలాక్, కియా సైరోస్‌ల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవడానికి ఈ నయా మాడల్‌ను తెస్తున్నది.

పెట్టుబడులపై ఫార్ములా-ఈ ఎఫెక్ట్!

ప్రభుత్వంతో ఒప్పందాలకు జంకుతున్న పారిశ్రామికవేత్తలు
స్నేహపూర్వక వాతావరణం లేదంటున్న ఇండస్ట్రీ వర్గాలు
కంగారు పడుతున్న అధికారులు.. భవిష్యత్తుపై ఆందోళన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలపై కాంగ్రెస్ సర్కారు అవలంభిస్తున్న వైఖరితో పరిశ్రమ వర్గాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి. తాజాగా ఫార్ములా-ఈ రేసు ఒప్పందంపై విచారణ చేపట్టడం, కేసులు నమోదు చేయడంతో అటు పెట్టుబడిదారులు, ఇటు అధికార వర్గాలు కలత చెందుతున్నాయి. రాష్ట్రంలో ఇక ఏమాత్రం పరిశ్రమకు స్నేహపూర్వక వాతావరణం లేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్నది. ప్రభుత్వ వైఖరితో పరిశ్రమ భవిష్యత్తు అంధకారమయ్యే అవకాశముందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ సంగతి..

సహజంగా రాష్ట్రాలు అమలు చేసే సరళీకృత విధానాలు, ప్రభుత్వాల పనితీరు, స్నేహపూర్వక వాతావరణం తదితర అంశాల ఆధారంగా పెట్టుబడులు పెట్టడం, ప్రభుత్వాలతో ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నాక నిశ్చింతగా ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, తదుపరి చర్యలు చేపట్టడం చేస్తారు. స్వతహాగానే ప్రభుత్వాలపై భరోసా ఉంటుంది కాబట్టి ధైర్యంగా వ్యాపారాలు చేసేందుకు ముందుకొస్తారు. అంతే కాదు, ప్రజాస్వామ్యంలో ఐదేండ్లకోసారి ప్రభుత్వాలు మారడం సహజ ప్రక్రియ. ఒక ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాన్ని ఆ తదుపరి వచ్చే ప్రభుత్వం కొనసాగించడం ఆనవాయితీ. దశాబ్దాలుగా ఇదే తరహా సంప్రదాయం కొనసాగుతూ వస్తున్నది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏదైనా పథకాన్ని కొనసాగించడం తదుపరి ప్రభుత్వానికి ఇష్టం లేకున్నా అప్పటికే మొదలైన పనులను పూర్తిచేసిన తరువాతే వాటిని నిలిపివేస్తారు. ఒప్పందాలు మాత్రం రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా యథావిధిగా కొనసాగించాల్సి ఉంటుంది.

కేసులతో రచ్చ

గడిచిన పదేండ్లలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన స్నేహపూర్వక విధానాలకు ఆకర్షితులై ఎన్నో దేశ, విదేశాలకు చెందిన కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకొని వ్యాపారాలు చేసేందుకు, పరిశ్రమలు పెట్టుకునేందుకు ముందుకొచ్చాయి. అందులో ఫార్ములా-ఈ రేస్ కూడా ఒకటి. ఢిల్లీ, ముంబైకి సైతం దక్కని ఖ్యాతిని హైదరాబాద్‌కు సాధించాలనే సంకల్పంతోపాటు కాలుష్యరహిత రవాణాను ప్రోత్సహించే ఉద్దేశంతో బీఆర్ఎస్ సర్కారు ఆనాడు కార్ రేస్‌ను నిర్వహించాలని నిర్ణయించి ఒప్పందం చేసుకున్నది. ఎంతో వ్యయ ప్రయాసలతో కూడిన ఈ రేస్‌లను అర్ధాంతరంగా నిలిపివేయడంతో నిర్వాహకులు ఆర్బిట్రేషన్‌ను ఆశ్రయించారు. ఈ వ్యవహారం నడుస్తుండగానే అప్పటి మంత్రితోపాటు అధికారులపై కూడా ప్రభుత్వం కేసులు నమోదు చేయడం ఇప్పుడు సర్వత్రా చర్చకు దారితీసింది.

ఆందోళన

గతంలో అనేక కంపెనీలు ప్రభుత్వం కల్పించే ప్రోత్సాహకాలు, ఇచ్చిన హామీలకు ఆకర్షితులై పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాయి. ఇందులో కొన్ని కంపెనీలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించగా, మరి కొన్ని కంపెనీల వివిధ దశల్లో ఉంది. తాజాగా ప్రభుత్వం ఫార్ములా-ఈ విషయంలో తీసుకున్న నిర్ణయంతో ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలతో పాటు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న కంపెనీల్లో ఆందోళన మొదలైంది. ఫార్మాసిటీ విషయంలోనూ ఇంచుమించు ఇలాగే జరిగింది. అన్ని అనుమతులూ వచ్చి పరిశ్రమల ఏర్పాటుకు సిద్ధంగా ఉన్న ఫార్మా సిటీని రద్దు చేయడంతో అప్పటికే పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న కంపెనీలు అయోమయంలో పడ్డాయి. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తున్నదనే భావన సర్వత్రా కలుగుతున్నది. దీంతో ప్రభుత్వం తరపున ఒప్పందాలు చేసుకునేందుకు అధికారులు కూడా జంకుతున్నారు. ఇటీవల పలువురు ఐఏఎస్ అధికారులు సమావేశమై.. లిఖితపూర్వకంగా ఇస్తే తప్ప ప్రభుత్వ ఆదేశాలను అమలు చేయరాదని నిర్ణయించినట్టు వార్తలు రావడం దీనికి నిదర్శనంగా చెప్పవచ్చు. ప్రభుత్వ వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో పరిశ్రమ భవిష్యత్తు ఎలా ఉంటుందో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

టెలికం సంస్థలకు ఇక్కట్లే!

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ ప్రైవేట్ టెలికం సంస్థలకు కొత్త ఏడాదిలో ప్రధానంగా రెండు సవాళ్లు ఎదురుకావచ్చన్న అంచనాలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఈ ఏడాది ఆయా టెలికం కంపెనీలు టారీఫ్‌లను పెంచిన విషయం తెలిసిందే. అయితే ఇది రివర్స్ ఫైర్ అయిందన్న సంకేతాలు వస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రధాన టెలికం సంస్థల నుంచి కస్టమర్లు ఇతర సంస్థల్లోకి మారిపోతున్నారు. దీంతో వచ్చే ఏడాదీ ఈ జంపింగ్‌లుంటాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనా వేస్తున్నాయి. నిజానికి ఇప్పటికే రిచార్జ్ ప్లాన్ల ధరలు తారెత్తిస్తున్నాయి. అయినప్పటికీ ఖర్చులు పెరిగాయన్న కారణాలతో టెలికం ఆపరేటర్లు ధరల భారాన్ని కస్టమర్లపై మోపుతూనే ఉన్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మధ్యలో ధరలు మరింత పెరగడంతో సబ్‌స్క్రైబర్ల సంఖ్య పెద్ద ఎత్తునే పడిపోయింది. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల్లో చార్జీలు 10 నుంచి 26 శాతం మేర పెరిగాయి. దీంతో ఆయా సంస్థలు 2.6 కోట్ల కస్టమర్లను కోల్పోయాయని అధికారిక గణాంకాలు చెప్తున్నాయి. మరోవైపు దాదాపు 68 లక్షల కస్టమర్లు ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ కనెక్షన్‌ను తీసుకున్నట్టు తేలింది. ఇప్పటికీ బీఎస్ఎన్ఎల్ 3జీ సర్వీసులనే ఇస్తుండగా, 4జీ సేవల విస్తరణ పనుల్లో ఉండటం గమనార్హం. అయినప్పటికీ కొత్త కస్టమర్లు వస్తున్నారంటే ధరల భారం ఏ స్థాయిలో ప్రైవేట్ కంపెనీలకు ప్రతికూలంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

శాట్కామ్‌ల ఎంట్రీతో..

వచ్చే ఏడాది శాటిలైట్ ఆధారిత సేవల సంస్థలతోనూ టెలికం కంపెనీలకు మార్కెట్‌లో భారీగానే పోటీ ఉండొచ్చన్న అంచనాలున్నాయి. ప్రధానంగా ఎలాన్ మస్క్ స్టార్‌లింక్ రాకతో ప్రస్తుతం టెలికం సంస్థలకు పెద్ద ఎత్తున ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న డాటా వ్యాపారానికి ఎదురుదెబ్బేనన్న అంచనాలు వ్యక్తమవుతున్నాయి. శాట్కామ్ సర్వీసులతో ధరల యుద్ధానికి వీలుందని, డాటా ధరలు ఇంకా పడిపోవచ్చని చెప్తున్నారు. ఇదే గనుక జరిగితే ప్రైవేట్ రంగ టెలికం సంస్థలకు నష్టాలే. 5జీ సేవలను దేశవ్యాప్తంగా విస్తరిస్తూ పోతున్న టెల్కోలు.. అందుకోసం రూ.70వేల కోట్లదాకా పెట్టుబడులు పెట్టాయి.

ఫండ్లలో మహిళా ఇన్వెస్టర్ల జోరు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీలో మహిళా పెట్టుబడిదారులు భారీగా పెరుగుతున్నారు. ప్రస్తుత సంవత్సరంలో చిన్న, మధ్యస్థాయి నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు ఫండ్లలో ఇన్వెస్ట్ చేస్తున్నారని, గడిచిన ఏడాదికాలంలో వీరి సంఖ్య రెండున్నర రెట్లు పెరిగినట్లు ఆన్‌లైన్ బ్రోకరేజ్ సంస్థ గ్రోవ్ తెలిపింది. మహిళల్లో ఆర్థిక స్వావలంభన పెరుగుతున్నదని, ముఖ్యంగా పట్టణ, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లో సైతం 140 శాతం పెరిగిందని, దీంతో వీరు ఈక్విటీ మార్కెట్లతోపాటు ఎంఎఫ్ మార్కెట్లలో విరివిగా పెట్టుబడులు పెడుతున్నట్లు వెల్లడించింది. మిగతా రంగాలకు దూరంగా ఉంటున్న మహిళలు..ఈక్విటీ, ఫండ్లలో పెట్టుబడులు పెట్టడానికి ఆసక్తి చూపుతున్నట్లు, ఈ ఏడాది కోటి మందికి పైకి చేరుకున్నారని గ్రోవ్ కో-ఫౌండర్, సీఈవో లలిత్ కేశ్రా తెలిపారు. గడిచిన ఏడాదికాలంలో మెట్రో, టైర్-1,2,3 నగరాల్లో ఫండ్లలో పెట్టుబడులు పెట్టే మహిళలు 100 శాతం చొప్పున పెరిగారు. నగరాల వారీగా చూస్తే ఢిల్లీ, ముంబై, కోల్‌కతా, పూణె, లక్నో, అహ్మదాబాద్, జైపూర్ వంటి మెట్రో నగరాల నుంచి అత్యధిక మంది మహిళలు మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేశారు. అలాగే పురుషుల కంటే సిప్‌లలో మహిళలు అత్యధికంగా పెట్టుబడులు పెట్టడం విశేషం. ఈ ఏడాది మ్యూచువల్ ఫండ్ ఇండస్ట్రీ ఏయూఎం రూ.17 లక్షల కోట్ల మేర పెరిగిందని ఆంఫీ తెలిపింది. డిసెంబర్ 2023లో రూ.50.79 లక్షల కోట్లుగా ఉన్న ఫండ్ ఆస్తుల విలువ ప్రస్తుతం రూ.68 లక్షల కోట్లకు చేరుకున్నది. అలాగే గత నెలలో దేశీయ స్టాక్ మార్కెట్లో కొత్తగా 42.76 లక్షల మంది చేరారు. అలాగే గడిచిన నాలుగేండ్లుగా ప్రతియేటా 3 కోట్ల డీమ్యాట్ ఖాతాలు ప్రారంభిస్తున్నారు.

ఎలక్ట్రానిక్స్‌లో కోటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: ఉద్యోగ కల్పనలో ఎలక్ట్రానిక్స్ రంగం దూసుకుపోతున్నది. వచ్చే మూడేండ్లలో ఈ రంగంలో 1.2 కోట్ల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని టీమ్‌లీజ్ తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. వీరిలో 30 లక్షల మంది ప్రత్యక్షంగాను, మరో 90 లక్షల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొంది. ప్రత్యక్షంగా ఉపాధి లభించనున్నవారిలో 10 లక్షల మంది ఇంజినీర్లు, 20 లక్షల మంది ఐటీఐ ప్రొఫెషనల్స్, 2 లక్షల మంది కృత్రిమ మేధస్సు, మెషిన్‌లెర్నింగ్, డాటా సైన్సెస్, నాన్-టెక్నికల్ విభాగానికి చెందిన 90 లక్షల మందికి ఉపాధి లభించనున్నది.

రిలయన్స్ చేతికి కార్కినోస్

న్యూఢిల్లీ, డిసెంబర్ 28: దేశీయ కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అనుబంధ సంస్థయైన ఆర్ఎస్‌బీవీఎల్ ..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవలను మరింత విస్తరించడంలో భాగంగా కార్కినోస్‌ను కొనుగోలు చేసింది. ఒప్పందం విలువ రూ.375 కోట్లు. జూలై 24, 2020లో ప్రారంభమైన కార్కినోస్..హెల్త్‌కేర్ టెక్నాలజీ సేవల్లో భాగంగా రోగ నిర్ధారణ, నిర్వహణ, అలాగే క్యాన్సర్‌ను ముందుగా గుర్తించే టెక్నాలజీ సేవలను అందిస్తున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను సంస్థ టర్నోవర్ రూ.22 కోట్లుగా ఉన్నది. ప్రస్తుతం సంస్థ దేశవ్యాప్తంగా 60 ఆసుపత్రులతో ఒప్పందం కుదుర్చుకొని వైద్య సేవలు అందిస్తున్నది.

సర్వేలతోనే సరి..!

అందని ద్రాక్షగా 'ఇందిరమ్మ' ఇళ్లు
ఆశగా ఎదురుచూస్తున్న నిరుపేదలు
దరఖాస్తులు, సర్వేలతో కాలయాపన చేస్తున్న సర్కార్
సాంకేతిక సమస్యతో ఇబ్బందిపడుతున్న సర్వే సిబ్బంది
కాంగ్రెస్‌ను మాటల ప్రభుత్వంగా కీర్తిస్తున్న ప్రజలు

అప్పుడెప్పుడో వచ్చిన 'అహ నా పెళ్ళంట' సినిమాలో బతికున్న కోడిని దూలానికి వేలాడదీసి దానివైపే చూస్తూ కోట శ్రీనివాస రావు అన్నం తినే సీన్ గుర్తుందా.. అదిగో అచ్చు అలాగే ఉంది.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు. గూడు లేని నిరుపేదలు 'ఇందిరమ్మ' ఇళ్ల కోసం వేయికళ్లతో ఎదురుచూస్తుంటే.. సర్కార్ మాత్రం అదిగో.. ఇదిగో అంటూ ఆశ చూపిస్తూ సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నది. అధికారంలోకి రాగానే అర్హులైన ప్రతిఒక్కరికీ ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చిన మూడురంగుల పార్టీ మాటల ప్రభుత్వంగా కీర్తికెక్కింది. ఈ ఏడాది పాలనలో ఏ ఒక్క సంక్షేమ పథకమూ ప్రజల వద్దకు చేరలేదు. తాజాగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల సర్వే సాంకేతిక సమస్యలతో నత్తనడకన సాగుతున్నది.

- ఖమ్మం, డిసెంబర్ 28

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం తొలివిడతలో సొంత స్థలం ఉన్నవారికి ఇండ్ల నిర్మాణం కోసం రూ.5 లక్షల సాయం చేస్తామని ప్రకటించింది. ఒక్కో నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులను గుర్తించనున్నది. గత ఏడాది డిసెంబర్‌లో నిర్వహించిన ప్రజాపాలనలో భాగంగా వివిధ పథకాల అమలు కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఖమ్మం కార్పొరేషన్‌లో 53,990 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో అర్హులను గుర్తించేందుకు అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు. ఖమ్మం కార్పొరేషన్‌లో 60 డివిజన్‌లు ఉండగా ఈ సర్వేలో 60మంది అధికారులు పాల్గొంటున్నారు. సాంకేతిక సమస్యలతో సర్వే నత్తనడకన సాగుతున్నట్లు తెలుస్తున్నది. ఇప్పటివరకు 32 వేల ఇళ్లను మాత్రమే సర్వే చేశారు.

సాంకేతిక సమస్యలే అధికం..

సర్వే నెమ్మదిగా జరగడానికి సాంకేతిక సమస్యలు అధికంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దరఖాస్తు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. 30 నుంచి 35 ప్రశ్నల ఆధారంగా వివరాలను సేకరించి, ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలి. పెద్ద సంఖ్యలో యాప్‌లో వివరాలు అప్‌లోడ్ చేస్తుండడంతో సర్వర్‌పై భారం పడుతున్నది. అంతేగాక కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్య తీవ్రంగా ఉండడం వల్ల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఒక్కో దరఖాస్తుదారుడు ఇంటి వద్ద గంటలకొద్దీ నిరీక్షించాల్సి వస్తున్నది. కొందరు ప్రజాపాలనలో పొందుపర్చిన చిరునామాల్లో అందుబాటులో ఉండడం లేదు. ఈ క్రమంలో సర్వే చేస్తున్న వారు రోజుకు 10 నుంచి 15 దరఖాస్తులను మాత్రమే సర్వే చేస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల జోక్యం..

ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతున్నది. ఐతే సర్వే చేస్తున్న అధికారులను కొంతమంది కాంగ్రెస్ కార్పొరేటర్‌లు, ఆయా డివిజన్‌లకు చెందిన కాంగ్రెస్ నాయకులు తాము చెప్పిన వారి ఇండ్ల వద్దకే రావాలని, ముందుగా తాము చెప్పిన వారి ఇండ్లను సర్వే చేసి ఆ తరువాత మిగిలిన వారి ఇండ్లను సర్వే చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. అదేవిధంగా ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులో ఉన్న అడ్రస్‌లో కొంతమంది లేకపోవడం వలన వారికి సమాచారం ఇవ్వట్లేదు.. మరికొన్ని చోట్ల సొంత స్థలాలు లేని వారు పాత ఇండ్లు ఉన్నవారు, ఆ డివిజన్‌లో ఖాళీ స్థలం ఉన్న చోట ఫొటోలు దిగుతున్నారు. వారికి కొంతమంది అధికారులు సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. ఒకే స్థలంలో మార్చి మార్చి ఫొటోలు దిగుతున్నారు. దీనివల్ల నిజమైన అర్హత ఉన్న పేదప్రజలకు నష్టం జరిగే అవకాశం ఉంది.

వైద్యులు పేదల ఆరోగ్యాన్ని కాపాడాలి

వైద్యారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్

మామిళ్లగూడెం యూపీహెచ్‌సీని సందర్శించిన డాక్టర్ రవీంద్రనాయక్

ఖమ్మం సిటీ, డిసెంబర్ 28 : వైద్యారోగ్యశాఖ పరిధిలోని వైద్యులు, సిబ్బంది బాగా పనిచేసి పేదల ఆరోగ్యాన్ని కాడాలని తెలంగాణ వైద్యారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీంద్రనాయక్ అన్నారు. శనివారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన తొలుత ఖమ్మం మామిళ్లగూడెం పరిధిలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌ను సందర్శించారు. స్థానికంగా ఉన్న గదులు, ఫార్మసీలోని బిన్ కార్డ్స్, స్టాక్ రిజిస్టర్స్‌ను తనిఖీ చేశారు. మందుల స్టాక్, రోగులకు రోజువారీగా ఇచ్చే అందిస్తున్న ఔషధాలు, ఈ ఔషధి ఇండెంట్, అవుట్ పేషెంట్స్ ప్రకారం బ్యాలెన్స్‌ను పరిశీలించారు. స్టోర్ నిర్వహణపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ల్యాబ్ వద్దకు వెళ్లి ఎటువంటి వైద్య పరీక్షలు చేస్తున్నారంటూ స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నరు. టీ హబ్‌కు శాంపిల్స్‌ను పంపిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. అనంతరం జిల్లా ప్రోగ్రాం అధికారులు, అర్బన్ హెల్త్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమణ వ్యాధులను అరికట్టే ప్రక్రియలను నిబద్ధతతో అమలు జరపాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులు ఆలోపతిక్ యాక్ట్ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బీ కళావతిబాయి, ప్రొగ్రాం అధికారులు డాక్టర్ సైదులు, డాక్టర్ చందునాయక్, డాక్టర్ రామారావు, డాక్టర్ వెంకటరమణ, డెమో సాంబశివారెడ్డి, యూపీహెచ్ వైద్యులు డాక్టర్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

నేడు సెమీ ఫైనల్, ఫైనల్ మ్యాచ్‌లు

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో టీ సునీల్‌రెడ్డి

ఖమ్మం సిటీ, డిసెంబర్ 28 : ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్ర స్థాయి అండర్-17 వాలీబాల్(బాల, బాలికల) పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. లీగ్ దశలో 33 జిల్లాలకు చెందిన జట్లు, క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా తలపడే విధానం క్రీడాభిమానులకు కనువిందు చేస్తోంది. ఉదయం, సాయంత్రం రెండుపూటలా పోటీలను నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వాలీబాల్ చాంపియన్‌షిప్‌పోటీల్లో భాగంగా శనివారం నాటికి లీగ్ దశ ముగిసింది. బాలుర విభాగంలో వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జట్లు సెమీస్ ఫైనల్స్‌లో అడుగుపెట్టాయి. బాలికల లీగ్ పోటీలు రాత్రి వరకు కొనసాగుతున్న నేపథ్యంలో ఖరారు కావాల్సి ఉంది. ఆదివారం ఉదయం నుంచి సెమీఫైనల్స్ పోటీలు జరుగనుండగా, అదేరోజు సాయంత్రం సెషన్‌లో ఫైనల్ పోటీలు సైతం పూర్తికానున్నాయి. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి తుంబూరు సునీల్ రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు విశేష ఆదరణ లభిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. పోటీలను బీపీడీ కళాశాల రవి, తెలంగాణ వాలీబాల్ అసోసియేషన్ సెక్రెటరీ మల్లేష్‌గౌడ్, ఖమ్మం జిల్లా ప్రసిడెంట్ నరేందర్, వాలీబాల్ స్టేట్ ఓవరాల్ కన్వీనర్ ఎండీ అక్బర్‌అలీ పర్యవేక్షించారు.

ఇండ్ల సర్వేను త్వరితగతిన పూర్తిచేయాలి

ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య



సమావేశంలో మాట్లాడుతున్న అభిషేక్ అగస్త్య

ఖమ్మం, డిసెంబర్ 28 : ఖమ్మం కార్పొరేషన్ పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ నిర్దేశిత సమయంలో పూర్తిచేయాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అదికారులను ఆదేశించారు. శనివారం ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో ఏర్పాటుచేసిన అధికారుల సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ సర్వే చేసేటప్పుడు అడిగే సమాచారం డాక్యుమెంట్లు సర్వేకు వస్తున్నట్లు ముందుగా సమాచారం అందించి వెళ్లాలన్నారు. ఇంటికి వచ్చిన వారికి సహకరించాలని వారికి తెలియజేయాలని అప్పుడే సమాచార సేకరణ త్వరగా జరుగుతుందన్నారు. ఇందిరమ్మ సర్వే ప్రక్రియలో తప్పులకు ఆస్కారం లేకుండా సమాచార సేకరణ చేయాలన్నారు.

ముగ్గురు మంత్రులుండీ.. పస్తులతో పనిచేస్తున్నం

రెండోరోజు సమ్మెలో జీపీ కార్మికులు



సమ్మెలో పాల్గొన్న పంచాయతీ కార్మిక సంఘాల నాయకులు

రఘునాథపాలెం, డిసెంబర్ 28 : జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి కూడా నెలల తరబడి వేతనాలు రాకుండా పంచాయతీ కార్మికులు పస్తులు ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని కార్మిక సంఘాల నాయకులు తోట రామాంజనేయులు, ఎస్.నవీన్‌రెడ్డి, జీ రామయ్య, మంద వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం గ్రామ పంచాయతీ కార్మికులు ఎంపీడీవో ఆఫీస్ ఎదుట చేస్తున్న రెండోరోజు సమ్మెలో ఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ సంఘాల నేతలు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్నరోజుల్లో దశల వారీగా సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిట్టల మల్లయ్య, శ్రీనివాస్, రాందాస్, భద్రు, సంపత్, వెంకటేశ్, విజయలక్ష్మి, కృష్ణ, వీరయ్య, రవి, శ్రీను, విజయ్, సుధాకర్, మంగీలాల్, రాజగోపాల్, రేణుక పాల్గొన్నారు.

నాన్న ప్రతిరూపం సాక్షిగా కూతురు పెళ్లి..!

- **రూ.4 లక్షల వ్యయంతో తండ్రిమైనపు బొమ్మ తయారు చేయించిన కూతురు**
- **పెళ్లి జరుగుతున్నంతసేపూ మండపంపైనే ఉంచి మురిసిపోయిన బిడ్డ**

కొత్తగూడెంలో తండ్రి